# కరీంనగర్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి



# బ్యాడ్మింటన్ క్రీడా స్ఫూర్తిని పరిరక్షించడానికి కృషి



మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** బ్యాడ్మింటన్ క్రీడాస్ఫూర్తిని పరిరక్షించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఐటి, శాసన సభ వ్యవహారాలు,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ అల్ఫోర్స్ నరేందర్ రెడ్డితో కలిసి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. శారీరక ధృడత్వాన్ని సులభంగా పొందగలుగుతూ ఆరోగ్యకరమైన జీవితాన్ని అనుభవించగలుగుతారని పేర్కొన్నారు. యువత, క్రీడాకారులు తనపై విశ్వాసంతో తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు అధ్యక్షునిగా ఎన్నుకున్నారని, తద్వారా బ్యాడ్మింటన్ క్రీడను పరిరక్షించే బాద్యత పెరిగిందని తెలిపారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గోపీచంద్ ప్రోత్సాహంతో తెలంగాణలోని 33 జిల్లా కేంద్రాలలో ఇండోర్ స్టేడియంల నిర్మాణానికి కృషి చేస్తున్నామని, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. విద్యారంగంలో రాణిస్తూ క్రీడారంగానికి ప్రోత్సాహాన్ని ఇస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అసోసియేషన్ చైర్మన్ అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడకు పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి, క్రీడాకారుల్లో బ్యాడ్మింటన్ క్రీడ పట్ల ఆసక్తిని పెంపొందించడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మంత్రి జన్మదినం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను చాలా గొప్పగా నిర్వహించడం జరిగిందని, విశేష సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారయన, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్, కార్యదర్శి గుంటపల్లి స్వామి, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, కోచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గోశాలను సందర్శించిన దేవాదాయ శాఖ కమిషనర్, కలెక్టర్



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్ :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల పై త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వేములవాడ పట్టణ వాసులు, భక్తులు, ప్రజలందరికీ అవగాహన కల్పించనున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, భీమేశ్వరాలయంలో ఏర్పాట్లపై ఆలయ గెస్ట్ హౌస్ లో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు,వీటీడీఏ వైస్ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడారు. రాజన్న ఆలయ విస్తరణపై భక్తులు, వేములవాడ వాసులు, ప్రముఖులు, పండితులు అందరికీ త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు విప్ తెలిపారు. రూ. 76 కోట్లతో ఆలయ విస్తరణ పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నట్లు వివరించారు. రాజన్న ఆలయాన్ని మూసివేయమని స్పష్టం చేశారు. దీనిపై ఎలాంటి అసత్య ప్రచారాలు చేయవద్దని సూచించారు. స్వామి వారికి నిత్య పూజలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఆలయంలో పనులు చేపట్టనున్న దృష్ట్యా భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శనానికి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. భీమేశ్వరాలయంలో నిత్య కల్యాణం షెడ్లు, భక్తుల దర్శనం క్యూలైన్లు, కోడెమొక్కుల క్యూ లైన్లు, ఆలయ ఆవరణలో షెడ్లు తదితరుల మౌలిక వసతులు వంటి మొత్తం 8 పలు అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నట్లు వెల్లడించారు. విశాలమైన స్థలం, ఆధునిక సౌకర్యాలతో గోశాలలు నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించగా, స్థానికంగా స్థలం గుర్తించాలని చర్చించారు. రాజన్న ఆలయ సమీపంలో కిలోమీటర్ పరిధిలో పెద్ద పెద్ద భవనాలు నిర్మించవద్దని గతంలో జారీ చేసిన జీవో ను 100 మీటర్లకు కుదించాలని చర్చించి సదరు జి ఓ సవరణ ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని పేర్కొన్నారు. కోడెల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి రాజన్న ఆలయానికి సంబంధించిన గోశాల లోని కోడెల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని దేవాదాయ శాఖ కమిషనర్ అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా గోశాల ఆవరణ కోడెలను కలెక్టర్ తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. కోడలకు పచ్చి గడ్డి ఇవ్వాలని నాణ్యమైన దాన పెట్టాలని క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించి కావాల్సిన మందులు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో స్థపతి వల్లి నాయగన్, ఈఓ వినోద్, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసులు గౌరవ వందనం స్వీకరించి జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై విశదపర్చారు. ఈ వేడుకల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సాయి చైతన్య, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఎఫ్ఓ వికాస్ మీనా, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, పురప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. జిల్లా బాలభవన్ ఇతర డ్యాన్స్ అకాడమీల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.




పేరిణి నృత్యం, నృత్య ఆకర్షణగా నిలిచింది. జిల్లా బాలభవన్, ఇతర డ్యాన్స్ అకాడమీల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. వ్యవసాయ, ఉద్యానవన జిల్లాగ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీ, పాడీ పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య జిల్లా వైద్యారోగ్య శాఖ మహిళా శిశు సంక్షేమం, నీటిపారుదల, ఫిషరీస్, విద్యాశాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథితో కలిసి కలెక్టర్ ఇతర అధికారులు స్టాళ్లను సందర్శించారు. రైతలకు విత్తనాలు పంపిణీ చేశారు.

**జడ్పీ కార్యాలయంలో పతాకావిష్కరణ గావించిన కలెక్టర్ :** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జడ్పీ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జడ్పీ సీఈఓ సాయగౌడ్ పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సాయిచైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల త్యాగాల పునాదులపై పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చైర్మన్ అనిల్ అన్నారు. ఈ వేడుకల స్ఫూర్తితో రాష్ట్ర ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు మమేకం కావలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనలో సిపిఐ పాత్ర కీలకం..

*పాల్గొన్న జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ముడుపు ప్రభాకర్ రెడ్డి..



**ప్రజాపక్షం/అదిలాబాద్/నిర్మల్:**ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ముడుపు ప్రభాకర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటంలో అమరులైన పోరాట వీరులకు నివాళులర్పించారు.అనంతరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర మరువలేనివి అన్నారు.అదేవిధంగా మాలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో సిపిఐ ముందుండి పోరాడిందన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు జాతీయస్థాయిలో తీర్మానం చేసిన ఏకైక జాతీయ పార్టీ సిపిఐ అని గుర్తు చేశారు.నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఆంధ్ర,తెలంగాణ,రయలసీమ ప్రాంతాలలోని అన్ని కలెక్టరేట్ల వద్ద ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేయాలని ధర్నా నిర్వహించిన ఘనత సిపిఐ పార్టీది అన్నారు.మాలి తెలంగాణ ఉద్యమ దశలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిపిఐ పార్టీ జాతీయ స్థాయిలో ప్రతేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు తీర్మానం చేయడంతో వెయ్యి ఏనుగుల బలం వచ్చిందని పలు సందర్భాల్లో అన్నారని గుర్తు చేశారు.శ్రీకృష్ణ కమిటీ సమావేశంలో కూడా నాటి సిపిఐ శాసనసభ పక్ష నేత దివంగత కామ్రేడ్ గుండా మల్లేష్ పెద్దన్న పాత్ర పోషించారన్నారు.సకల వర్గాల పోరాటంలో సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు అన్నారు.నేడు కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి సంక్షేమాన్ని మరిచి మతతత్వ రాజకీయాలకు చేస్తుందన్నారు.తెలంగాణ రాష్ట్ర సెంటిమెంట్ తో గద్దెనెక్కిన టిఆర్ఎస్ గత ప్రభుత్వం 10 సంవత్సరాలు గద్దెనెక్కి ప్రజలకు చేసిందేమీ లేదని,కేవలం కుటుంబ పాలనతో రాష్ట్రన్ని నట్టిట ముంచారన్నారు.తెలంగాణ ఇచ్చిన పార్టీ,ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వంలో ఉన్న పార్టీ కాంగ్రెస్ ప్రజల సంక్షేమం కోసం,రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది ఎర్రజెండా అని అన్నారు.తెలంగాణ అమరవీరుల స్ఫూర్తిగా ప్రజలందరూ ప్రజా సమస్యల పరిష్కారానికి,ప్రజా పోరాటాలు నిర్వహించడానికి భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజల పక్షాణ ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకురాలు కామ్రేడ్ ముడుపు నలిని రెడ్డి,సిపిఐ పట్టణ కార్యదర్శి కామ్రేడ్ అరుణ్ కుమార్,ఏఐటియూసీ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ కుంటాల రాములు,ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కామ్రేడ్ తబ్రెజ్ ఖాన్,మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు కామ్రేడ్ అమీనా బేగం,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్థాంగి రమేష్,సిపిఐ సీనియర్ నాయకులు నర్సింగరావు,దళిత కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రాందాస్,సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సులు..



**ప్రజాపక్షం/నేరడిగొండ:**నేరడిగొండ మండలంలో 03 నుండి ఈనెల 20వ తేదీవరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తహసిల్దార్ ఎమ్.ఏ ఖలీమ్ తెలిపారు.సోమవారం మండల కార్యాలయంలో జరిగిన సన్నహాక సమావేశంలో అధికారులకు అవగాహనా కల్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,32 గ్రామ పంచాయతీల పరిధిలో రెవెన్యూ,అగ్రికల్చర్,పంచాయతీరాజ్ సెక్రటరీల,సమన్వయముతో రైతులకున్న భూ సమస్యలను,భూ సర్వే రికార్డ్స్ ను,భూమికి సంబంధించిన ఎటువంటి సమస్యలనైనా ఈ సదస్సులలో పరిష్కరింపబడతాయని తెలిపారు.రైతులు ఈ భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని సత్వర భూ సమస్యల నుండి విముక్తి కావాలని ఆయన అన్నారు.

## ఎస్ఐకి బిఆర్ఎస్ నాయకులు సన్మానం

**ప్రజాపక్షం/ముధోల్ :**మంధోల్ మండల నూతన ఎస్ఐగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన బిట్ల పెర్సిస్ ను సోమవారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వంగా కలిసి శాలువాతో సన్మానించారు.మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.తమ వంతు బాధ్యతగా పోలీసులకు అన్ని విధాలుగా సహకరిస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్సై బదులిస్తూ చట్టాన్ని కాపాడుతూ మండల ప్రజలకు న్యాయం అందేలా తన పూర్తి బాధ్యత నిర్వర్తిస్తానని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు అశోక్,తిరుపతి రెడ్డి,మాజీ ఎంపిటిసిగంగాధర్,పోశెట్టి, శంకర్, సాయిరెడ్డి,ఎస్.కె బాబు,నవీన్,గంగాధర్,రాథోడ్ గణపతి, విజయ్,కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తుంటే పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు..

**ప్రజాపక్షం/సారంగాపూర్ :**సారంగాపూర్ మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో అనుమానాస్పందంగా ట్రాక్టర్ పట్టుకోగా అందులో దుండలను అక్రమంగా తరలిస్తున్నట్టు తెలిసింది.ఫారెస్ట్ అధికారులను చూసి డ్రైవర్తోపాటు కూలీలు పరార్ అయినప్పటికి ,ట్రాక్టర్లు,పట్టుకొని సీజ్ చేసినట్లు అటవీ క్షేత్ర అధికారి జీవి రామకృష్ణరావు తెలిపారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్ ను తనిఖీ చేయగా 15 దుండలను తరలిస్తుంటే పట్టుకున్న నిర్మల్ ఫారెస్ట్ కార్యాలయానికి తరలిస్తున్నట్లు తెలిపారు.పూర్తిస్థాయి విచారణ చేసి ఆ దుండలను ఎక్కడ సరికారో అని ఏ ప్రాంతం నుంచి తీసుకు వస్తున్నారో పూర్తిస్థాయి విచారణ చేసిన తర్వాత కేసు నమోదు చేసి కోర్టుకు సబ్మిట్ చేస్తామని అన్నారు.దాని విలువ ప్రకారం లెక్కిస్తే దాదాపు 1లక్ష ఆరు వేల రూపాయలు ట్రాక్టర్ ను సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నమన్నారు.ఈ దాడులలో ఫారెస్ట్ అధికారులు నజీర్ ఖాన్,అటవీ క్షేత్ర అధికారి వన్నెల బీట్ అధికారి సంతోష్, భీమేష్, ఎఫ్.డి.ఓలు ఉన్నారు.

## దిలావర్పూర్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం..



**ప్రజాపక్షం/దిలావర్పూర్ :**దిలావర్పూర్ మండలంలోని కేంద్రంలో తహసిల్దార్,ఎంపీడీవో,కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవసి ఘనంగా సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మహమ్మద్ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ ఎందరో త్యాగాల ఫలితామే నేటి తెలంగాణ దినోత్సవం నిర్వహించుకుంటున్నమన్నారు.తెలంగాణ అమరులు,ఉద్యమకారులను స్మరించుకుంటున్నమన్నారు.రాష్ట్రం అభివృద్ధిలో పోటీ పడుతుందని,అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ రాణి,ఉప తాసిల్దార్ రాజేష్,ఎంపీఓ గోవర్ధన్,ఆర్ఐ మమత,పిఎసిఎస్ చైర్మన్ పి.వి.రామారెడ్డి,మాజీ ఎంపీపీ పాల్దే అనీల్,మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో

నిర్మల్ పట్టణంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.జాతీయ జెండా ఎగరవేసి సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమ్ పార్టీ కన్వీనర్ మాట్లాడుతూ ఈ రోజు ప్రత్యేకమైన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరులను ఉమాకారులను స్మరించుకుంటునానమన్నారు.వారి త్యాగాల ఫలితమే మన తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని రాష్ట్రం ఏర్పాటు 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రం సాధించిన ప్రగతిని ఎదుర్కొంటున్న సభలను సమర్పించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం కన్వీనర్ వినోద్,వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్,సాజిద్,రాజు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ జెడ్‌పిటిసిను పరామర్శించిన నాయకులు..

**ప్రజాపక్షం/ముధోల్:**ముధోల్ మండల మాజీజెడ్పిటిసినర్సాగౌడ్ ఇటీవల అనారోగ్యంతో శస్త్ర చికత్స చేసుకుని రావడంతో సోమవారం ముధోల్ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు నారాయణ రావు పటేల్,విఠల్ రెడ్డి ఆయన్ను పరామర్శించారు.ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.విశ్రాంతి తీసుకుంటూ ఆరోగ్య నియమాలను అలవరించుకోవాలన్నారు.కాంగ్రె స్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి,సీనియర్ నాయకులు శంకర్ చంద్రే, ముత్యం రెడ్డి,మాజీ సర్పంచ్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నా రు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడతలో మంజూరైన గృహ నిర్మాణాలకు కాగజ్‌నగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) కోట ప్రసాద్ సోమవారం మార్కింగ్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి, గాంధీనగర్‌లలో ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన ఇండ్ల నిర్మాణాలకు ఆయన ముగ్గు వేసి నిర్మాణ పద్ధతిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ, సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించి సొంతింటిని నిర్మించడమే ఇందిరమ్మ ఇండ్ల పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని, ఇంటి నిర్మాణానికి విడతల వారీగా నిధులు విడుదల చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఖానాపూర్ అభివృద్ధికి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించి ఇన్ని సంవత్సరాలు అయినా ఖానాపూర్ మండలం అభివృద్ధికి నోచుకోలేదు అని పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో గల బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు.గత బిఆర్ఎస్ పాలనలో మండల కేంద్రానికి అది చేశాం ఇది చేశాం అని చెప్పుకున్న బిఆర్ఎస్ పార్టీ అయిన,ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ అయినా ఖానాపూర్ నీ ఎలాంటి అభివృద్ధి చెయ్యలేదు అని బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్ అన్నారు.ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చి 11 సంవత్సరాలు అయిన ఖానాపూర్ మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు,అందులో రైతన్నలకి ఉపయోగపడే సదర్మాట్ బ్యారేజ్ నిర్మాణం పక్క నియోజకవర్గనికి వెళ్లేలా గత పాలకులు చేశారని,పట్టణంలో రోడ్డు వెడల్పు జరగలేదు,ఇంటిగ్రేడ్ మార్కెట్ నిర్మాణం మధ్యలో ఆగిపోయింది.ఖానాపూర్ ని రెవెన్యూ డివిజన్ చేస్తామని చేయకుండా పదిలేశారు.పశు వైద్యశాల నిర్మిస్తూనే ఉన్నారని ఇంకా నిర్మాణం పూర్తి కాలేదని,ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ విషయంలో అన్యాయం జరిగిందనీ,రెంకొన వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జ్ల నిర్మాణం అసంపూర్తిగానే ఉందనీ,బస్ డిపో ప్రతిపాదన ఉన్న ఊసే లేదని,నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను కూడా మండల కేంద్రం కాకుండా నియోజకవర్గ పేరు చెప్పి తరలిస్తున్నారని,కనీసం ఇంటిగ్రేట్‌డ్ స్కూల్ నీ అయిన మండల కేంద్రంలో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు.పేరుకే నియోజకవర్గమైన ఏలాంటి అభివృద్ధి లేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్ గారు అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్ పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ కుమార్ మండల ప్రధాన కార్యదర్శిలు కొండవేని రమేష్,జెట్టి సురేందర్,కంతి లింబాద్రి,బీజేపీ నాయకులు తోకల బుచ్చన్న,పిట్టల భూమన్న,నల్ల రవీందర్ రెడ్డి,ఇనుముల,స్వామి,తదితరులు ఉన్నారు.

## భూ భారతి సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :**భూ సమస్యలు ఏమి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భూభారతి సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని ఖానాపూర్ ఎమ్మార్వో సుజాత తెలిపారు.ఎమ్మార్వో మాట్లాడుతూ మంగళవారం నుండి ఖానాపూర్ మండలంలో గల 19 గ్రామపంచాయతీలతో పాటు ఖానాపూర్ పట్టణంలో తిమ్మాపూర్,ఖానాపూర్ రెవెన్యూ పరిధిలో భూభారతి సదస్సులను నిర్వహిస్తామని, ఇందులో ప్రజలు తమ భూములకు సంబంధించిన ఎటువంటి సమస్యను అయినా పరిష్కరించుకోవచ్చని,ఇందులో భూములకు సంబంధించిన హద్దులు,పట్టా పాస్బుక్కుల పైన భూ యజమానుల కుటుంబలకు సంబంధించిన ఇంటి పేర్లలో ఏవైనా మార్పులు ఉంటే వాటిని సరి చేసుకోవాలని,సదా బైనామా భూములలో అయినా ఎటువంటి మార్పులు ఉన్న సరిచేసుకోవాలి అన్నారు.ఈ భూ భారతి సదస్సులు 3వ తేదీ మంగళవారం నుండి 19వ తేదీ గురువారం వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఎవరైనా తమ గ్రామాలలో ఈ సదస్సు నిర్వహించిన రోజు హాజరు కాని వారు ఉంటే తదుపరి వెంటనే మరుసటి రోజు ఎమ్మార్వో కార్యాలయంలో తమ భూమికి సంబంధించి సమస్యలను తెలుపవచ్చని అన్నారు.ఈ భూభారతి సదస్సులు 20 తేదీ లోపే ఉంటాయి కనుక సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.భూ భారతి సదస్సులలో పట్టా పాస్ బుక్ జిరాక్స్,సదా బైనామా జిరాక్స్ లు తీసుకురావాలని అన్నారు.

## డాక్టరేట్ పొందిన కమలాకర్‌కు సన్మానం

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి:**ఇటీవలే డాక్టరేట్ పొందిన కొండగుర్ల కమలాకర్‌ను సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘన ంగా సన్మానించారు. జిల్లా కార్యదర్శి ముదు పు ప్రభాకర్‌రెడ్డి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కమలాకర్ విద్యార్థి దశలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏఐఎస్‌ఎఫ్‌లో పని చేశారని అన్నారు. ఉన్నతంగా చదువుకొని సమాజాభివృద్ధి అనేక విధాలుగా పనిచేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యవంతం చేయడం అభినందనీయమన్నారు. జాతీయ మహిళా సమైక్య రాష్ట్ర నాయకురాలు ముడుపు నలినిరెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కుంటాల రాములు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు తబ్రెజ్‌ఖాన్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు అమీనా బేగం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అర్దాంగి రమేష్, సిపిఐ సీనియర్ నాయకులు నర్సింగరావు, దళిత కుల పోరాట స మితి జిల్లా అధ్యక్షులు రాందాస్, సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

**ప్రజాపక్షం/బాన్సువాడ :**ప్రతి ఒక్కరి జీవితంలో యోగ భాగమైనట్లయితే వారి జీవన విధానం మానసిక ప్రశాంతతోపాటు ఆరోగ్యంగా ఉంటారని యోగ ప్రశిక్షకులు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం బాన్సువాడ మునిసిపల్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం ఆయుష్ దశాబ్దా ఉత్సావాల్లో భాగంగా మునిసిపల్ ఉద్యోగులకు యోగ, శాఖాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, శాఖాహార భోజనం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, మునిసిపల్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రెగ్యులర్ అధికారులను నియమించాలి




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రెగ్యులర్ విద్యాశాఖ అధికారిని నియమించాలని డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని విధాలా వెనుకబడిన కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ అధికారి, మైనారిటి గురుకులాల జిల్లా అధికారి, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి, జిల్లా క్రీడా అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వంటి ముఖ్యమైన జిల్లా స్థాయి పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయని, అదేవిధంగా మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్‌లు కూడా ఇన్చార్జ్‌లతో కొనసాగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆయా శాఖల కార్యాలయాల్లో పనులు పెండింగ్‌లో ఉంటున్నాయని వారు ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు పలు ఇతర శాఖల్లో రెగ్యులర్ అధికారులను నియమించాలని కోరారు. లేని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడం టీకానంద్, గొడిసెల కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి శ్రావణి, దుర్గం నిఖిల్, జిల్లా కమిటీ సభ్యురాలు కుందూరపు మంజుల తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక లారీలకే లోడింగ్ ఇవ్వాలి:యజమానుల రిలే నిరాహార దీక్ష



**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :**కోల్ బెల్ట్ ఏరియా పరిధిలో స్థానిక లారీలకు మాత్రమే లోడింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లారీ యజమానులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నస్పూర్‌లోని తీగల్ పహాడ్ గోదాం వద్ద కోల్ బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లారీ యజమానులు మాట్లాడుతూ, సిసిఐ గోదాం అధికారులు స్థానిక లారీ యజమానుల ఉపాధిని దెబ్బతీసేలా తమిళనాడు, కేరళ నుండి తక్కువ కిరాయిలకు లారీలను తెప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల స్థానికంగా ఉన్న లారీ యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది లారీ యజమానుల కుటుంబాలు లారీలపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, తమ లారీలకు లోడింగ్ ఇవ్వకపోతే తమ పరిస్థితి ఏమిటని వారు అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా సిసిఐ అధికారులు స్పందించి స్థానిక లారీలకు లోడింగ్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ నిర్ణయించిన కిరాయి మాత్రమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి లారీ యజమానులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కోల్ బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుండా సురేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల సుమన్, జనరల్ సెక్రెటరీ రాందేని రమేష్, జాయింట్ సెక్రెటరీ అరికోళ్ల రమేష్, కల్చర్ సెక్రెటరీ గుడికందుల తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ దాసరి పవన్, క్యాషియర్ కటకం ప్రశాంత్ మరియు పలువురు లారీ యజమానులు పాల్గొన్నారు.

## కాకతీయ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:**జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలలో కాకతీయ విద్యార్థుల ప్రతిభ చాటారు. సోమవారం విడుదల చేసిన జెఇఇ అడ్వాన్స్ 2025 ఫలితాలలో కాకతీయ విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని కాకతీయ విద్యాసంస్థల చైర్‌పర్సన్ సీహెచ్.విజయలక్ష్మీ తెలిపారు. సాయి సర్వజిత్ 347, శివ 1299, ఎం.శ్రీకాంత్ 6383, వేదాక్షర్ 9524 జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని తెలిపారు. ఐఐటి, నీట్, ఎంసెట్ అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్.రామోజీ రావు మాట్లాడుతూ తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి సత్తా చాటారన్నారు. కాకతీయ డైరెక్టర్ సిహెచ్.తేజస్విని మాట్లాడుతూ ఈ అత్యుత్తమ ఫలితాలు సాధించటానికి కాయతీయ ఐఐటి, నీట్, ఎంసెట్ అకాడమీలోని ప్రత్యేక పాఠ ప్రణాళిక, యాజమాన్య నిరంతర పర్యవేక్షణ, వారాంతపు పరీక్షలే ముఖ్య కారణమన్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సందీప్ కులకర్ణి, వైస్‌ప్రిన్సిపాల్ విధితగౌడ్, శ్యాం, జ్యోత్స్న, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ అజెండా

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :**రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ పార్టీ అజెండా అని రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర వీరులకు నివాళులర్పించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ ఏర్పాటు అయినట్టు గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క సంవత్సరంలోనే ఆరు గ్యారంటీలతో పథకాలను ప్రారంభించిందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, గృహజ్యోతి వంటి పథకాల అమలుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నదన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ద్వారా పేదల సంక్షేమం, సమగ్ర పాలసీలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పారదర్శక పాలన లక్ష్యాలుగా నిర్దేశించామన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు, కన్నబియ్యం పథకాలు అమలవుతున్నాయన్నారు. జిల్లాలో 12 జాబ్ మేళాలు నిర్వహించి 112 మందికి ఉపాధి కల్పించామని, బందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నదన్నారు. రేషన్ కార్డులు, భూభారతి గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏలు కోవా లక్ష్మి, హరీష్ బాబు, ఎంఎల్‌సి దండే విటల్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్‌పి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్‌లో :**

కాగజ్‌నగర్‌లో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సిర్పూర్ ఎంఎల్‌ఎ డా. పాల్వాయి హరీష్ బాబు తన నివాసం, తెలంగాణ చౌక్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. బిఆర్‌ఎస్ నాయకులు రాజీవ్ గాంధీ చౌరస్తా, ఆర్‌ఎస్. ప్రవీణ్ కుమార్ నివాసంలో జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎంఎల్‌ఎ కోనేరు కోనప్ప కోనేరు నిత్యాన్నదాన సత్రం వద్ద జెండా ఎగురవేసి, అమరవీరులకు నివాళులర్పించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, బిజెపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ రూరల్ :**తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ కోట ప్రసాద్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం. మధుకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. చింతగూడ గ్రామ పంచాయతీలో కార్యదర్శి కమ్మరి హరీష్‌తో పాటు ఇతర గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లోనూ జెండా వందనం నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సిర్పూర్ టి :**

మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లాం జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రహీముద్దీన్, మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి తిరుపతి, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ సత్యనారాయణ జాతీయ జెండాలను ఎగురవేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో న్యాయవాదులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, మాజీ సర్పంచ్ ఖిజార్ హుసేన్, మాజీ వార్డు సభ్యులు ఇఫ్ఫాత్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక ప్రారంభం

**ప్రజాపక్షం / మందమర్రి :**మందమర్రి మున్సిపాలిటీలో 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' అనే నినాదంతో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రారంభమైందని మందమర్రి మున్సిపల్ కమీషనర్ తుంగపిండి రాజలింగు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజలింగు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్రణాళికలో 50 అంశాలకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టనున్నారు. మొదటి రోజు జాతీయ జెండా ఎగురవేసి ర్యాలీ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు, వనమహోత్సవం, ఇంకుడు గుంతల నిర్మాణం వంటివి ఈ 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఉంటాయని, సిబ్బంది వార్డుల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తారని, ఇంటి నెంబర్లు లేని వారికి నెంబర్లు జారీ చేయడం, వ్యాపారులకు లైసెన్సులు ఇవ్వడం వంటి కార్యక్రమాలు కూడా చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ ఇంజనీర్ సుమతి, ఎఇ. సందీప్, శానిటరీ ఇన్స్పెక్టర్ వి. శ్యాంసుందర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు బంగారు బాట

**ప్రజాపక్షం/ మందమర్రి :**స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సింగరేణి సంస్థ ముందుకొచ్చింది. రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, హైదరాబాద్ వారి సహకారంతో సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సోలార్ టెక్నీషియన్ కోర్సును మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్‌లాంఛనంగాప్రారంభించా రు. ఈ సందర్భంగా జిఎం. దేవేందర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మరియు సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సూచనల మేరకు ఈ కోర్సును ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సింగరేణి కాలరీస్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం స్థానిక నిరుద్యోగ యువతకు ఒక గొప్ప అవకాశమని ఆయన తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం యువత స్వయం ఉపాధి పొందడానికి ఇది దోహదపడుతుందని, తద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం. విజయ ప్రసాద్, సిఎంఒ ఎఐ అధ్యక్షులు రమేష్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, ఎంవిటిసి. మేనేజర్ శంకర్, అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ అశోక్, సోలార్ టెక్నీషియన్ ట్రైనర్ ప్రవీణ్ కుమార్, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

## జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన అభినయ్

**ప్రజాపక్షం / బాన్సువాడ :**బాన్సువాడ పట్టణానికి చెందిన అభినయ్ ఇటీవల జెఇఇఅడ్వాన్సు ఫలితాల్లో ఉత్తమప్రతిభ కనబరచడంతో పాటు ఆలిండియా 3334 ర్యాంకు సాధించడంతో పాటు ఓబిసిలో 617 ర్యాంకు సాధించడం పట్ల పలువురు విద్యార్థి సాధించిన ప్రతిభను అభినందిస్తున్నారు.

## రాష్ట్రాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్తాం

**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :**తెలంగాణ రైజింగ్2047 విజన్‌తో రాష్ట్రాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్తామని ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. నస్పూర్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో లక్ష్యాలతో ఈ డాక్యుమెంట్ రూపొందించామని తెలిపారు. ఇది భవిష్యత్తు తెలంగాణకు భగవద్గీత లాంటిదని అభివర్ణించారు. విజన్‌లో పేదల సంక్షేమం, సమగ్ర విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. మహిళల ఉచిత ఆర్‌టిసి ప్రయాణం, గ్యాస్ సిలిండర్‌పై రాయితీ, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం అందిస్తున్నామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. విద్య, గృహ నిర్మాణం, హైదరాబాద్ అభివృద్ధి ప్రణాళికల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నవనాథపురం ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సమావేశం

ప్రజాపక్షం / ఆర్మూర్ :నూతనంగా ఎన్నుకోబడ్డ నవనాథపురం ప్రెస్‌క్లబ్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రెస్ క్లబ్ భవనంలో ఉంటుందని అధ్యక్షుడు సంజీవ్ పార్థిమ్, కార్యదర్శి తమ్మి వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పాత కార్యవర్గానికి సన్మాన కార్యక్రమం ఉంటుందని, సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షులు సంజీవ్ పార్థిమ్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

## ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన ర్యాలీ

ప్రజాపక్షం/ బోధన్:బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని మురికి కాలువలు పరిశుభ్రంగా చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ వీధిలో చెత్త సేకరణ కోసం వచ్చే వాహనాలలోనే చెత్త వేయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగ ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం

ప్రజాపక్షం/మోర్తాడ్:అమరుల త్యాగఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరుల వీరుల త్యాగాలను వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..



ప్రజాపక్షం/లోకేశ్వరం:లోకేశ్వరం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవ సందర్భంగా తెలంగాణ భారత రాష్ట్ర సమితి జెండా,జాతీయ జెండా ఆవిష్కరించిన ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోలం శ్యాంసుందర్,మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్ ,ఆవిష్కరించడం జరిగింది,ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపిపి సాగర్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్,మాజీ ఎంపిటిసి సాయన్న,నాయకులు గంగాధర్,హరీష్,సందీప్,సుధాకర్ ప్రకాష్ ,ప్రవీణ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు మరువలేనివి




ప్రజాపక్షం/బోధన్:తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరు వీరుల త్యాగాలు మరువలేనివని బిజెపి నాయకులు అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గల అమర వీరుల స్థూపాన్ని శుభ్రంగా కడిగి పూలమాలలు వేసి తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించి వారి త్యాగాలను కొనియాడారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి మాట్లాడుతూ.. బోధన్ పట్టణంలో గల అమర వీరుల స్థూపాన్ని శుభ్రం చేయకపోవడం బాధకరమన్నారు. ప్రతిఏటా అమరవీరుల స్థూపాన్ని పూలమాలలు, లైటింగ్‌తో అలంకరించి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా నిర్వహించేవారని, ఈఏడాది విస్మరించడంతో విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మోసానికి పాల్పడి తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చర్యలు

### సీపీకి ఫిర్యాదు చేసిన హ్యూమన్‌రైట్స్



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసిన వ్యవసాయ భూమి విషయంలో మోసానికి పాల్పడి తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ సభ్యులు సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన కాలేవర్ జ్యోతి మహిళ తన తండ్రితో కలిసి డిచ్‌పల్లి మండలం బీబీపూర్ తండాలో భూమి కలిగిన గారిపల్లి సుజాత నుంచి 2023 అక్టోబర్ 5న కొనుగోలు చేశారు. రూ. 28 లక్షల డబ్బులు తిరిగి చెల్లించి సంబంధిత భూమిని రీరిజిస్ట్రేషన్ చేసుకోవాలనే ఒప్పందంతో భూమి కొనుగోలు జరిగింది. గతేడాది సెప్టెంబర్ 18న గారేపల్లి సుజాత, విఠల్ రాథోడ్‌లు సంబంధిత భూమిని డిచ్‌పల్లి మండలం కమలాపూర్‌కు చెందిన మహిళకు విక్రయించేందుకు రూ. 5 లక్షల అడ్వాన్స్ తీసుకుని మోసం చేశారు. మొత్తం డబ్బులు చెల్లించి సంబంధిత భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నారని ఫిర్యాదు చేశారని తెలిపారు. సంబంధిత భూమి వివాదంలో ఉందని ప్రచారం చేస్తున్న వారిపై అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కాలేవర్ సుజాత, రవీందర్, హ్యూమన్ రైట్స్ సభ్యులు తేలు సరిత, పుప్పాల గీత, మోహన్ తదితరులున్నారు.

## జై తెలంగాణ... నినాదంతో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ అర్బన్‌లో 11వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినత్సోవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి జై తెలంగాణ నినాదాలు మిన్నంటే విధంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అమర వీరులకు నివాళులు అర్పించారు.

**నిజామాబాద్ కోర్టు ఆవరణలో...**

నిజామాబాద్ కోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తి జి.వి.ఎన్. భరత లక్ష్మి జాతీయ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. సకల జనుల నిరవధిక సమ్మె కారణంగా ఎంతోమంది త్యాగాల ఫలం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమని అన్నారు. వారందరి ఆశయ సాధనకై మనందరం ఐకమత్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ సిబ్బంది యువ శైలజ, రాజ్ కుమార్ సుబేదార్, బార్ కౌన్సిల్ నాయకులు మాణిక్ రాజ్, మల్లెపూల జగన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

**కమిషనరేట్ కార్యాలయంలో**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించారు. సిపి క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్య జాతీయ జెండా ఎగురవేశారు. డిఐజి జోన్ 2 క్యాంపు కార్యాలయంలో అదనపు పోలీసు కమిషనర్ (అడ్మిన్) జి. బస్వారెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. ఏ.ఆర్. హెడ్ క్వార్టర్స్ లో అదనపు డిసిపి (ఎ.ఆర్.) కె. రామచంద్రరావు జాతీయ జెండా ఎగురవేశారు. పోలీసు కార్యాలయంలో సిపిఆర్‌బి ఏసిపి రవిందర్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు.

**ప్రెస్‌క్లబ్‌లో...**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ పాలకవర్గం రామకృష్ణ, శేఖర్, పరమేశ్వర్, గంగారెడ్డి, శ్రీకాంత్, దేవిదాస్, స్థానిక రిపోర్టర్లు పాల్గొన్నారు.

**తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయంలో**

బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తెలంగాణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సిర్ప రాజు, మాజీమేయర్, బాజిరెడ్డి జగన్, టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలను కొలిస్తేనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయి



ప్రజాపక్షం/కోటగిరి:గ్రామ దేవతలను కొలిచినప్పుడే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని, పంటలు సంవృద్ధిగా పండుతాయని పురోహితులు శివశాస్త్రి పేర్కొన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం యాద్గార్పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహలక్ష్మీ , పెద్ద పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయాల ప్రారంభోత్సవాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అమ్మవార్లకు పంచామృత అభిషేకం నిర్వహించి విగ్రహ మూర్తులకు ప్రాణ ప్రతిష్ట చేశారు. అంతకుముందు భాజభజంత్రీలతో విగ్రహమూర్తుల ఊరేగింపు కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్టాపన, యంత్ర ప్రతిష్టాపన, శిఖ ప్రతిష్టాపన , యాగశాలలో పూర్ణాహుతి తదితర పూజ కార్యక్రమాలను వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం పురోహితులు శివ శాస్త్రి మాట్లాడుతూ.. గ్రామ దేవలను కొలిస్తే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. నూతన ఆలయాల్లో విగ్రహ ప్రతిష్టాపన లో భాగంగా గ్రామంలో మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పుల్కంటి కిష్టయ్య, గడ్డం కృష్ణ కుమార్, పాపయ్య, సింపాలం లక్ష్మణ్, ఒడ్డయ్య, మేత్రి సాయిలు, సంగెం లక్ష్మణ్, టాక్లీ లాలయ్య, గడ్డం లాలు, ముత్తయ్య, సాయాగౌడ్, మహేష్ గౌడ్, దొడ్డ కిష్టయ్య, శ్రీధర్, కాశీరామ్, ప్రశాంత్, బరిశెట్టి ఆంజనేయులు, బోధన్ హన్మంతు, పుల్కంటి వీరేందర్, భూమేష్, సాయిబాబు, బోధన్ శ్యామ్, బరిశెట్టి శ్రీనివాస్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో రాష్ట్ర ఫస్ట్ ర్యాంకు సాధించిన శ్రీనివాస్‌రెడ్డికి రూరల్ ఎమ్మెల్యే సన్మానం

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం గ్రామానికి చెందిన తినేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంటర్ మొదటి సంవత్సరంలో 468 మార్కులతో (మొత్తం 470లో) రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి గ్రామానికి, జిల్లాకు గౌరవం తీసుకవచ్చారు. ఈ సందర్భంలో రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని శాలువ కప్పి సన్మానించి అభినందించారు. అలాగే ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాలలో రాష్ట్ర స్థాయి ప్రతిభ కనబర్చిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తినేటి లక్ష్మణ్, అనిల్ పాల్గొన్నారు.

## నందిపేట్ గ్రామ మైనార్టి కమిటీ ఎంపిక

ప్రజాపక్షం / నందిపేట్ :నందిపేట్ గ్రామ మైనార్టీ కమిటి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బారి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ జమీల్, సయ్యద్ ఖాదిర్, షేక్ ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ ముక్బుల్, కోశాధికారి అబ్దుల్ ఘనీ, సంయుక్త కార్యదర్శి షారుఖాన్, వాజిద్‌లను ఎన్నుకున్నారు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాపక్షం / నందిపేట్ :డొంకేశ్వర్ మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నరేష్ కుమార్ తెలిపారు. 3న కోమటిపల్లి, 4న నికాల్పూర్, 5న తొండాకూర్, 6న దత్తాపూర్, 9న మారంపల్లి, 10న డొంకేశ్వర్, 12న గాదేపల్లి, చిన్నయానం, 13న నడికుడ, 16న అన్నారం, 17న సిర్పూర్, 18న నూత్‌పల్లి, 19న గంగాసముందర్ గ్రామాల్లో జరుగుతాయని ఆయన చెప్పారు. ఈ సదస్సులలో భూభారతి సమస్యల గురించి వినతి పత్రాలు అందజేయాలని కోరారు. నందిపేట్ మండలంలో 3న సిద్దాపూర్, 4న జోర్పూర్, ఖుదావన్ పూర్, 5న నందిపేట్, షాపూర్, 6న బజార్ కొత్తూరు, మయాపూర్, 9న ఉమ్మెడ, బాద్గుణ, 10న కొండూరు, తల్వేద, 11న లక్కంపల్లి, చింరాజ్‌పల్లి, 12న అయిలాపూర్, కంఠం, 13న మల్లారం, వెల్మల్ గ్రామాల్లో సదస్సులు ఉంటాయని వసంత్‌రావు తెలిపారు.

## భూభారతితో భూ సమస్యలకు ఫుల్‌స్టాఫ్

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:భూభారతితో భూ సమస్యలకు ఫుల్‌స్టాఫ్ పడనుందని తహసీల్దార్ శాంత అన్నారు. సోమవారం ధర్పల్లి మండలంలోని మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. దేశానికి వెన్నుముక అయిన రైతులు భూ సమస్యలతో తరచూ వివాదాలతో సతమతమవుతున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన భూభారతితో రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఒకవేళ గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులకు రైతులు అందుబాటులో లేకుంటే జూన్ 20 లోగా మండల రెవెన్యూ కార్యాలయంలో భూమి సమస్యలకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. రైతులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించే భూభారతి సదస్సులను ఉపయోగించుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా ప్రజలకు తెలిపారు.

## పేదవారికి స్వంత ఇంటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ పథకం



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :పేదవారికి స్వంత ఇంటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ పథకం అని ఎంపీడీఓ బాలకృష్ణ అన్నారు. ధర్పల్లి గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్దిదారులకు ఎంపీడీఓ బాలకృష్ణ ప్రోసీడింగ్ కాపీలను అందజేసి మార్కవుట్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా ప్రతి పేదవారికి స్వంత ఇంటి కలలు నెరవేర్చుకోవాలని ప్రతి లబ్దిదారునికి 5 లక్షలు 100 శాతం సబ్సిడీతో ఇందిరమ్మ గృహ నిర్మాణానికి ఇవ్వటమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, చిన్నబాల్‌రాజ్, మల్లిఖార్జున్, శ్రీనివాస్, గంగారెడ్డి, సుభాష్, నర్సయ్య, సురేందర్ గౌడ్, హమీద్, బాలయ్య పాల్గొన్నారు.

## ఎల్ఒసిచెక్ అందజేత



**ప్రజాపక్షం/ముత్తారం:**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన కట్కూరి సుజాత అనారోగ్యానికి గురయ్యారు.దీంతో బాధిత కుటుంబ సభ్యులు , గ్రామ నాయకులు మంత్రి, స్థానిక ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. మంత్రి స్పందించి ఎల్ఒసి చె క్కును ఆయన వ్యక్తిగత పిఎద్వారా సోమవారం హైదరాబాదులోని నిమ్స్ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులకురూ.75వేల ఎల్ఒసిచెక్ అందించారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబుకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బ్లూబెల్స్ హైస్కూల్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్‌లోని హనుమాన్ నగర్‌లోని బ్లూబెల్స్ హైస్కూల్ ప్రాంగణంలో తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల కరెస్పాండెంట్ జంగ సునీత మనోహర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చారిత్రక నేపథ్యం, సంస్కృతి, భవిష్యత్ తరంపై బాధ్యతపై మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన తెలంగాణజానపదనృత్యంఆకర్షణగానిలిచింది.

## ఘనంగా దర్గా ఉర్సు ఉత్సవాలు

### హుజురాబాద్ ఎసిపి మాధవి



**ప్రజాపక్షం/జమ్మికుంట:**జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లా అలై దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సంధర్భంగా హుజురాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ దర్గాను సందర్శించారు. దర్గా వద్ద ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తుపై కమిటీకి సలహాలు, సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం దర్గా కమిటీ హుజురాబాద్ ఏసిపి మాదవికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్, దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ కార్యదర్శి మొహమ్మద్ జమాల్ అష్రఫ్, దర్గా కమిటీ సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయీముద్దీన్, దర్గా కమిటీ సభ్యులు మొహమ్మద్ అబ్బాస్, ఇమ్రాన్, ఇర్ఫాన్, సమీర్, అజ్మత్ తదితరులున్నారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

### తహసీల్దార్ వరందన్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కొత్త ఆర్ ఓ ఆర్ చట్టం 2025 ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందని రైతులు ఈ అ వకాశము సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసిల్దా ర్ కె వరందన్ తెలిపారు . జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ,గ్రామముల వారిగా భూభారతి రెవెన్యూ సదస్సు లు ఈనెల 3 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు ,జరుగుతాయని తెలిపారు. రెవెన్యూ బి టీం ఆర్ ఐ జీవన్ ,షబాన జూనియర్ అసిస్టెంట్ ,ప్రశాంతి ఎంపిఎస్ఒ ,మమత జూనియర్ అసిస్టెంట్ ,తిరుపతి రికార్డ్ అసిస్టెంట్ పాల్గొంటారు .ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారు .మండల కేంద్రంలోని ప్రజలు తమ భూమి సమస్యలపై దరఖాస్తులు నేరుగా రెవెన్యూ అధికారులకు ఇచ్చి వారి వద్దని సమస్య ప్రస్తావించి పరిష్కారం చేసుకునే అవకాశం ఉంటుంది కావున గొల్లపల్లి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ వరందన్ వరంగల్ సూచించారు.

# సకల జనుల సమ్మె,అమరుల త్యాగ ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సకల జనుల సమ్మె, అమరుల త్యాగ ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని, రాష్ట్ర ఆకాంక్షలను నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని, సామాజిక , ఆర్థిక తెలంగాణ కోసం మరో పోరాటం చేయక తప్పదని అందుకు ప్రజలు, కార్మికులు సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ పేర్కొన్నారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969లో అనేక మంది విద్యార్థులు ,పోరాట నాయకులు అమరులైనారని. మలిదశ ఉద్యమం లో సుమారు 1200 మంది విద్యార్థులు త్యాగాలు చేశారని, సకలజనులు రాష్ట్రం కోసం ఉవ్వెత్తున పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు, రాష్ట్ర సాధన కోసం సిపిఐ జాతీయ పార్టీని ఒప్పించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వాల్సిందేనని జాతీయ పార్టీలో తీర్మానం చేసి, ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొని, అనేక ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు పార్టీ ప్రజా సంఘాల ద్వారా పోరాటాలు పెద్ద ఎత్తున చేశామన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో సిపిఐ పాత్ర మరువలేనిదన్నారు. రాష్ట్రాన్ని సాధించుకొని 11 సంవత్సరాలు గడిచినా , ప్రజలకు , నిరుద్యోగులకు ఎలాంటి ఉపయోగం లేదని, రాష్ట్ర సాధన వల్ల నాయకులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప ప్రజలకు, నిరుద్యోగుల కు ఒరిగిందేమీ లేదని ఆయన అన్నారు. మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, ఉద్యోగుల సమ్మెలు ఈ పోరాటాన్ని ఉధృతం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని అందించాయన్నారు. కానీ, ఏ ఆకాంక్షలతో అయితే స్వరాష్ట్రం ఏర్పడిందో, ఆ ఫలాలను తెలంగాణ ప్రజలకు అందించకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దెనెక్కి అధికార దుర్వినియోగంకు పాల్పడి లక్షల కోట్ల ప్రజల సొమ్మును గత ప్రభుత్వం దోచుకుందని ఆయన అన్నారు , రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో కన్నా అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత టిఆర్ఎస్ కే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా తెలంగాణ కోసం అమరవీరులైన కుటుంబాలకు నేటికీ న్యాయం జరగలేదని, సంబండ వర్గాలు అనేక ఆశలు పెట్టుకుని జీవిస్తున్న వారి ఆశలు అడియాసలే చేస్తున్న పాలకవర్గాలను నిలదీయడానికి మరో సామాజిక, ఆర్థిక తెలంగాణ కోసం ఉద్యమించాలని ఆయన ప్రజలను, కార్మికుల ను కోరారు.సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కనకరాజ్ అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్ సిపిఐ జెండా వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, ఈ కార్యక్రమంలో సిపిఐ, పార్టీ ప్రజాసంఘాల నాయకులు తాళ్ళ పెల్లి మల్లయ్య,సంకె అశోక్, బోగ సతీష్ బాబు, అబ్దుల్ కరీం,నాని,తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు భూభారతిపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు,రేషన్ డీలర్లకు భూభారతి పై అవగాహన సదస్సు నిర్వహించిన తహసిల్దార్ వరందన్ .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3 నుండి 20 వ తేదీ వరకు జరుగు భూభారతి అవగాహన సదస్సులు ఆయా గ్రామాలలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆ గ్రామంలో ఒకరోజు ముందుగా డప్పు చాటింపు చేయించి రెవిన్యూ సదస్సులు జరుగుతాయని గ్రామ ప్రజలకు తెలియజేయాలని అన్నారు .రెవిన్యూ సదస్సులో రైతులు తమ సమస్యలపై రాసి ఇచ్చే దరఖాస్తులను ఒకరోజు ముందుగానే గ్రామ పంచాయతీలో ఉంచి ప్రజలకు అందేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు .తహసీల్దార్ వరందన్ ,ఎంపీడీవో రామ్ రెడ్డి ,ఎంపీ ఓ సురేష్ రెడ్డి ,ఆర్ ఐ లు జీవన్ ,అనూష ,గ్రామపంచాయతీ కార్యదర్శులు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## కండ్లపల్లి మోడల్ స్కూల్ ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

### కండ్లపల్లి మోడల్ స్కూల్ సరిత దేవి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** తెలంగాణ మోడల్ స్కూల్ కండ్లపల్లి లో ప్రవేశాల కొరకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు ఎంపికైన విద్యార్థుల జాబితాలు పాఠశాలలో అందుబాటులో ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపల్ సరిత దేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.మోడల్ స్కూల్ లో 6 వ తరగతికి ఎంపికైన విద్యార్థుల జాబితా,7 నుండి 10 వ తరగతి బ్యాక్ లాక్ సీట్ల కొరకు ఎంపికైన విద్యార్థులు జాబితా, 10 వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపికైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర విద్యార్థుల జాబితాను పాఠశాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. 6 నుండి 10 వ తరగతికి ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, కుల, ఈ.డబ్ల్యూ.ఎస్ ( ఐఫ్ ఓసి ), విద్యార్థి పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, స్టడీ సర్టిఫికెట్స్, ఒరిజినల్ టిసి డాక్యుమెంట్లను, ఇంటర్ మొదటి సంవత్సరంకి ఎంపికైన విద్యార్థులు పై తెలిపిన డాక్యుమెంట్స్ తో పాటు, పదవ తరగతి మార్కుల మెమోను జతపరిచి వారం రోజుల లోపు పాఠశాలలో సమర్పించి సీటుని పొందగలరని పాఠశాల ప్రిన్సిపల్ సరిత దేవి తెలిపారు.

# మార్కెట్ వ్యవస్థపై నమ్మకం కలిగేలా కృషి

### హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్

**ప్రజాపక్షం/జమ్మికుంట:**వ్యవసాయ మార్కెట్ వ్యవస్థపై నమ్మకం కలిగేలా కృషి చేస్తానని దద్వాయి హమాలీలు, రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం జమ్మికుంట పట్టణంలో గల వ్యవసాయ మార్కెట్‌లో కార్మికులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులే మార్కెట్లకు పునాది అని, వారి సంక్షేమానికి కాంగ్రెస ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. మూడేళ్ల పాటు ఎదురుచూసిన పాలకవర్గం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసుకున్నామని, ప్రభుత్వానికి రైతులకు వారదిగా ఉంటూ వారి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సెక్రటరీ హమాలీ దద్వాయా సంఘం అధ్యక్షుడు తదితరులున్నారు.

## మంథని టు హుజురాబాద్ బస్సు సర్వీస్‌పునః ప్రారంభం




**ప్రజాపక్షం/ ముత్తారం :** మంథని నుండి ఓడేడు మీదుగా జమ్మికుంట టూ హుజురాబాద్ వరకు ఆర్‌టిసి బస్సు ను సోమవారం మంథని ఆర్ టిసి డిపో మేనేజర్ ప్రారంభించారు.ఈసందర్భంగాడిపో మే నేజర్ మాట్లాడుతూ మంథని డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ప్ర తీ రోజు హుజురాబాద్ కు రెండు ట్రిప్పులు డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్ తెలిపారు. ఉదయం 6 గంటల15 నిమిషములకు, మ ధ్యాహ్నం 2 గంటల 40 నిమిషాలకు మంథని బస్టాండ్ నుంచి బ యలుదేరి ఓడెడ్, ముత్తారం, కాల్వ శ్రీరాంపూర్, జమ్మికుంట మీ దుగా రాకపోకలు సాగనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో హుజూరాబాద్ నుంచి ఉదయం 10గంటలకు, సాయంత్రం 5 గం టల 40 నిమిషాలకు బస్సు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కో రారు.

## నేటి నుండి భూభారతి గ్రామసభలు

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూభారతి కార్యక్రమం పై ఈనెల 3 నుండి 20వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తారం మండలంలోని ఓడేడు, లక్కారం , అడవి శ్రీరాంపూర్, పోతారం, మచ్చుపేట, ఖమ్మంపల్లి, జిల్లెల్లపల్లి, పారుపల్లి,ఇప్పల పల్లి,శాత్రారాజు పల్లి, కేశనపల్లి గ్రామంలో సీతంపేటమైదం బండ,దర్యాపూర్ హరిపురం, సర్వారం అలాగే మండల స్థాయిలో భూభారతి పై కార్యక్రమం ఉంటుందన్నారు. భూభారతిపై నిర్వహించే గ్రామసభల కార్యక్రమాలకు ఆయా గ్రామాల్లోని ప్రజలు పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహించే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.

## భక్తాంజనేయ స్వామి విగ్రహ పున: ప్రతిష్టాపన

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మండలంలోని గోవిందుపల్లి గ్రామంలో భక్తాంజనేయ స్వామి విగ్రహ పున:ప్రతిష్టాపన ఆలయ ధర్మకర్త పాలకుర్తి కిషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు వైభవంగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్యన పూజలు హోమం రామనామ స్మరణతో విగ్రహ ప్రతిష్ఠాపన కన్నుల పండుగగా వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ లో విభాగం గోరక్షక మండల అధ్యక్షులు జంగిలి సత్యం,సహా ప్రముఖ్ కోట తిరుపతి, జంగిలి సురేష్ కుమార్,అన్నేడ మధుసూదన్ రెడ్డి,నక్క లచ్చయ్య, గ్రామ ప్రజలు ,తదితరులు పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర దేవాలయ ధర్మాదాయ శాఖ కమిషనర్



ప్రజా పక్షం/ వేములవాడ: సోమవారం దేవాదాయ శాఖ కమిషనర్ కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణ కుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. స్వామి వారి కళ్యాణమండపములో ఆలయ అర్చకులు కమిషనర్ దంపతులకు వేదోక్త ఆశీర్వాదం అందించగా, అనంతరం ఈ వో కే. వినోద్ శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. ఆయన వెంట ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తండ్రిని చంపిన తనయుడు

ప్రజాపక్షం/చందుర్తి:మద్యం తాగి గొడవ చేస్తున్నాడని కన్న తండ్రిని కొడుకు కడతేర్చిన ఘటన మండలం లోని సనుగుల గ్రామం దేవుని తండా లో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దేవుని తండా కు చెందిన జలోత్ తిరుపతి (45) ప్రతి రోజు మద్యం తాగి ఇంటి వద్ద గొడవ చేయడం తో విసుగు చెందిన అతని కుమారుడు రాజేష్ (22) సోమవారం సాయంత్రం ఇంటి వద్ద కారుతో తండ్రిని ఢీకొట్టాడు.అనంతరం అంబులెన్స్ లో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడని అన్నారు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:మండల కేంద్రంలో తెలంగాణ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిపారు.ఉదయం ఎనిమిదన్నర ప్రాంతంలో తహసీల్దార్ సుజాత అధ్యర్యంలో కార్యలయం వద్ద జెండా ఆవిష్కరణ చేసి వందనం చేశారు.మండల పరిషత్ కార్యలయంలో గుండోజు సత్తయ్య,కాంగ్రెస్ పార్టీ,బీఆర్ఎస్ కార్యాలయల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి జెండావందనం చేశారు.జిల్లా అభివృద్ధిపై పథకాల కార్యచరణ సజావుగా కొనసాగించాలని మండల మేజిస్ట్రేట్ తెలిపారు.అనంతరం స్వీట్లు తినిపించుకున్నారు.రెవిన్యూ,పోలీసు,అధికారులు పాల్గొని విజయవంతం చేశారు.మార్కెట్‌కమిటి వద్ద సబేరబేగం,ప్రాథమిక సహకార సంఘం వద్ద సింగిల్విండో చైర్మెన్ గుండారపు కృష్ణారెడ్డి,మాజి జడ్పీటీసీ చీటి లక్ష్మణ్ రావు,కాంగ్రెస్ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి,బ్లాక్‌కాంగ్రెస్ నర్సయ్య,జిల్లా కార్యదర్శి వంగగిరిధర్‌రెడ్డి,చెన్నిబాబు,గౌస్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అందెసుభాష్,సెస్ డైరక్టర్ వర్సకృష్ణహరి,మండల అధికారులు తదీతరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు పథకాల పంపిణీ

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ భవన్ సమీపంలోని పరేడ్ గ్రౌండ్ లో సోమవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా సిరిసిల్లలోని పాత బస్ స్టాండ్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే తదితరులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్లో జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా తన సందేశాన్ని వినిపించారు. జిల్లాలోని 110 స్వశక్తి సంఘాలకు 102 కోట్ల 45 లక్షల బ్యాంక్ లింకేజీ రుణాలను పంపిణీ చేశారు. ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో ప్రతి గ్రామానికి నాణ్యమైన విధానం – రైతన్నకు నేస్తంపేరిట వానాకాలం 2025లో నాణ్యమైన విత్తనాలను పలువురు రైతులకు అందజేశారు. టీ ప్రైడ్ పథకం కింద 42 మంది ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు 1 కోటి 85 లక్షల సబ్సిడీ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు.

**శకటాల ప్రదర్శన**

రవాణా శాఖ, ఆర్టీసీ ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో అందించే సేవలు, పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపరెడ్డి వేములవాడ సిరిసిల్ల ఆర్‌డిఒలు రాధాబాయి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్‌పి చంద్రయ్య డిఎస్‌పి,సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్ మున్సిపల్ క మిషనర్లు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉన్నత ఆశయాలకు నిరంతర కృషి అవసరం

### వాల్మీకి ఆవాస విద్యార్థులతో ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : చదువుతోనే బంగారు భవిష్యత్తు సాధ్యపడుతుందని జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి అన్నారు.సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి సోమవారం సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. బాల్యం నుండే రాజ్యాంగ వ్యవస్థల పట్ల, చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే ఆశయంతో పనిచేస్తున్న వాల్మీకి ఆవాస నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ గంప కరుణాకర్ మనుమరాలు యష్విశ్రీ జన్మదినం సందర్భంగా 65 మంది ఆవాస విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను జిల్లా న్యాయమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆవాస నిర్వాహకులు డాక్టర్ భీమనాతిని శంకర్, నందెల్లి మదన్ మోహన్ రావు, కైలాసం,మధుకర్, నరసింగరావు, సత్యం, మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా వడ్లు కొనుగోలు

### రైతుల ఖాతాలలో 48 గంటల్లోనే డబ్బులు కోటి 50 లక్షల కిలోల వడ్లు సేకరణ

ప్రజాపక్షం/సుల్తానాబాద్:ఆరుగాలం శ్రమించే రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా పూర్తి పారదర్శకంగా వడ్లు కొనుగోలు చేపట్టామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు శ్రీగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సింగల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 10 కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేసి రైతులు ఏలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు చేపట్టామని తెలిపారు. విక్రయించిన ధాన్యానికి 48 గంటల్లోనే రైతుల ఖాతాలలో డబ్బులు జమ అయ్యాయని 10 సెంటర్లలో కోటి 50 లక్షల కిలోల వడ్లు సేకరించడం జరిగిందని తెలిపారు. వాతావరణం అన్ని విధాలుగా అనుకూలించి పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు రైతులకు కాలువ నీరు సకాలంలో అందించడంతో అధిక పంట దిగుబడి వచ్చిందని రైతులు ఎన్ని వడ్లు తీసుకువచ్చిన ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సూచించడంతో పూర్తి కొనుగోలు చేపట్టామని తెలిపారు. కొనుగోళ్లకు సహకరించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో పాటు మార్కెటింగ్, బ్యాంకు సిబ్బంది పిఏసిఎస్ సిబ్బందితో పాటు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సింగిల్ విండో డైరెక్టర్లు పలువురు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి తైక్వాండోకు అర్హత సాధించిన సన్ రైస్ తైక్వాండో అకాడెమీ ప్లేయర్స్



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ వారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ పట్టణంలో మే నెల 31, జూన్ 1 తేదీన ఆర్యవైశ్య భవన్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో జగిత్యాల పట్టణానికి చెందిన సన్ రైస్ తైక్వాండో అకాడెమీ ప్లేయర్స్ ఆరుగురు పాల్గొనగా వరుసగా 3 గోల్డ్ మోడల్స్, 2 సిల్వర్ మోడల్స్, 2 బ్రాంజ్ మోడల్స్ ను సాధించారు. వారిలో బండి లాస్య ప్రియ, మహేష్ , సిరి గోల్డ్ మెడల్స్ ను, కార్తీక్, విహా సిల్వర్ మెడల్స్, గందె సమర్థ్ రెండు బ్రాంజ్ మోడల్స్ ను సాధించడం జరిగింది. ఈ మెడల్స్ ని తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ కురువ శ్రీహరి చేతుల మీదుగా ప్లేయర్స్ స్వీకరించడం జరిగినదని, అలాగే గోల్డ్ మెడల్ సాధించిన ప్లేయర్స్ జూన్ 23 తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ కి అర్హత సాధించినట్లు సన్ రైస్ తైక్వాండో అకాడెమీ కోచ్, జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ గందె సంతోష్ కుమార్ తెలిపారు. మెడల్స్ సాధించిన వారిని జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ మంచాల క్రిష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ ముఠా శ్రీనివాస్, జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ కోల గంగారావు , మాస్టర్స్ , తదితరులు పాల్గొన్నారు.

## పేదలకే ఇందిరమ్మ ఇండ్లు..

### జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గిరిధర్‌రెడ్డి

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు పత్రాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందించిందని అన్నారు.సోమవారం లబ్దిదారుల ఇళ్ళ వద్ద భూమి పూజకు హాజరై మాట్లాడారు.ఇందిరమ్మ స్వంతింటి కల సాకారం చేసుకోవాలని ఆయన అన్నారు.కార్యదర్శి ప్రవీణ్‌కుమార్,కాంగ్రెస్ నాయకులు,చెన్నిబాబు, రామిరెడ్డి,గోపాల్,శ్రీనివాస్,చందు, బాబా, మల్లేషం,రాజ్‌కుమార్,రాములు,లబ్దిదారులు వెంట

## వికసిత కృషి సంకల్ప అభియాన్ అనే కార్యక్రమం

ప్రజాపక్షం/ముత్తారం : రేపు ఉదయం 8 గంటలకు ముత్తారం మండలంలోని మచ్చుపేట, అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీలలో కృషి విజ్ఞాన కేంద్రం , రామగిరిఖిల్లా వారి ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఖరీఫ్ సీజన్ కు రైతులను వ్యవసాయ పరంగా సాంకేతిక సలహాలు సూచనలు అందించడం ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రము రామగిరి , శాస్త్రవేత్తలు,ఐ సి ఏ ఆర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉద్యానవన శాఖలు ఇతర శాఖల అధికారులు పాల్గొనడం జరుగుతుంది, అదేవిధంగా వ్యవసాయంలో డ్రోన్లు వాడకం, వాటి ఆవశ్యకత మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం ఉన్నట్లు ఈ కార్యక్రమానికి రైతు సోదరులు పెద్ద సంఖ్యలో ఇట్టి కార్యక్రమానికి హాజరై సాంకేతిక సలహాలు పొందగలరని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఎండలో చెప్పలు కుట్టుకుంటున్న వృద్ధుడికి ఏసిపి ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/జమ్మికుంట:కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి జమ్మికుంటలో పలు కార్యక్రమాలకు హాజరై తిరిగి వెళ్తుండగా గాంధీ చౌరస్తాలో పేద వృద్ధుడు రాచపల్లి వెంకటయ్య మండు టెండలో చెప్పులు కుట్టుకుంటూ కనబడగా వెంటనే వాహనం ఆపారు. ఆ వృద్ధుడి వివరాలు తెలుసుకుని ఆవేదనకు గురయ్యారు. బార్య మృతిచెందిన తర్వాత కుమారుల పరిస్థితి సైతం నిలకడగా లేదని వెంకటయ్య వాపోయాడు. ఇల్లు లేదు సార్.. చెప్పులు కుట్టుకుంటూ బస్టాండ్ వద్దే పడుకుంటున్నా అన్న మాటలు ఏసిపి మనసును తాకాయి. వెంటనే వ్యక్తిగతంగా రూ.2వేలు ఆర్థిక సాయం అందజేశారు. అంతేకాకుండా ప్రతి నెల రూ.2 వేలు పంపిస్తానని హామీ ఇచ్చారు. అంతటితో ఆగకుండా శాయంపేట ప్రాంత నాయకులకు ఫోన చేసి వెంకటయ్య కోసం ఒక చిన్న గృహం ఏర్పాటు చేయాలని కోరారు. దానికి కావాల్సిన ఖర్చును తానే భరిస్తానని తెలిపారు. ఏసిపి ప్రశాంత్‌రెడ్డిని స్థానికులు ప్రశంసలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/చొప్పదండి:చొప్పదండి పట్టణంలోని 12వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం భూమి పూజ నిర్వహించారు. 12వ వార్డులో లబ్దిదారులు గుర్రం మల్లేశ్వరి రవీందర్‌ల భూమి పూజ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, 12 వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి, మాజీ పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిలు పాల్గొని ముగ్గు పోసి ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నిజాసపురం చందు, సీనియర్ నాయకులు గుర్రం రమేష్ గౌడ్, కదారి శంకర్, మాజీ సర్పంచ్ మునిగాల సుధాకర్ గౌడ్, తోడేటి దేవిడ్, మునిగాల చందు, బొడిగె తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జోడెద్దుల్లా రాష్ట్రంలో అభివృద్ధి ,సంక్షేమం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాష్ట్రంలో అభివృద్ధి ,సంక్షేమం రెండు జోడెద్దులగా పరిగెడుతున్నాయన్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆది శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 కోట్ల ప్రజల చిరకాల స్వప్నం గుర్తించిన స్వరాష్ట్ర కాంక్షను నెరవేస్తూ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత సోనియా గాంధీది అన్నారు. సాధించుకున్న రాష్ట్రంలో గత పది సంవత్సరాల అరాచక పాలనకు ప్రజలు చరమ గీతం పాడి ప్రజా పాలన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎన్నికల సమయంలో పిసిసి అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి చెప్పిన ప్రతి మాటను అమలు చేస్తూ ముందుకు పోతున్నాం అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 లకే సిలిండర్,10 లక్షల ఆరోగ్య శ్రీ,ఇందిరమ్మ ఇల్లు, సన్నం బియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. నేతన్నలకు గత ప్రభుత్వం పెట్టిన 200 కోట్ల బకాయిలు చెల్లించడం జరిగిందన్నారు.మన ప్రాంతంలో పదవు పద్దా ప్రాజెక్టులను నేడు తిరిగి పనులు ప్రారంభించామన్నారు. ప్రజా ప్రభుత్వంలో వేములవాడ ప్రాంతంలో 200 కోట్ల తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయడం జరిగిందని నిరుద్యోగులకు ప్రభుత్వం ఏర్పడిన ప్పటి నుండి ఇప్పటి వరకు 65 వేల కి పైగా ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుమూల స్వరూప, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాష్, కాముని వనిత, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, గడ్డం నరసయ్య, ప్రభాకర్, ఎల్లే లక్ష్మీ నారాయణ, చందన,తిరుపతి రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, కిరణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:**పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం మొదలవుతున్నాయని జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ముదారపు పరమేశ్వర్ తెలిపారు.జిల్లాలో 312 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.ఈ విద్యార్థులందరూ నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సోమవార్పేట్లో పరీక్ష రాస్తారని తెలియజేశారు.పరీక్ష నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్ ను,డిపార్ట్మెంట్ అధికారులు,సిట్టింగ్ స్క్వాడ్ తో పాటు ఇన్విజిలేటర్ లను నియమించినట్లు వివరించారు.పరీక్షలు సీసీ కెమెరా పర్యవేక్షణలో జరగనున్నాయని తెలిపారు.విద్యార్థులు ప్రతిరోజు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.ఐదు నిమిషాలకు మించి ఆలస్యమైతే విద్యార్థులను పరీక్ష రాసేందుకు అనుమతించేది లేదని చెప్పారు.విద్యార్థుల హాల్ టికెట్లు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్సైట్లో కలవని వాటిని విద్యార్థులు గాని,ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కానీ డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు.అలా వీలుకాని పక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కూడా హాల్ టికెట్లు అందుబాటులో కలవని వెల్లడించారు.ప్రతిపరీక్ష కేంద్రంలో మెడికల్ సిబ్బంది అంగన్వాడి సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది కూడా ఉంటారని తెలిపారు.వికలాంగుల కొరకై వీల్ చైర్ ను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.రేపటి నుండి ప్రారంభం కానున్న ఈ పరీక్షల కోసం నిర్మల్ లో ఏకైక కేంద్రమైన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సోమవారపేట యందు ఏర్పాట్లు అన్ని పూర్తయినట్లు వెల్లడించారు.ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం.930 నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించబడతాయని వెల్లడించారు.ఏడు రోజుల పాటు జరగనున్న ఈ పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ను రెవెన్యూ అధికారులు అమలు చేస్తుందని,ఆ సమయంలో జిరాక్స్ సెంటర్లు కూడా మూసి వేయబడి ఉంటాయని తెలిపారు.

## నేటి నుంచి భూభారతి గ్రామసభలు..

**ప్రజాపక్షం/సోన్ :**రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి గ్రామసభలు నేటి నుంచి ప్రారంభమవుతాయని మండల తాసిల్దార్ మల్లేష్ సోమవారం తెలిపారు.మండలంలోని గ్రామాలలో రెండు బృందాలుగా ఏర్పడి ప్రతి గ్రామానికి రెండు రోజుల చొప్పన గ్రామసభలు ఉంటాయని ఒక బృందం తాసిల్దార్ మల్లేష్ మరో బృందం నాయిబ్ తాసిల్దార్ జ్యోతిల ఆధ్వర్యంలో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు.సంఘంపేట్,కడ్తాల్ ,న్యూ బొప్పారం ,సిద్దిలకుంట ,లోకల్ వెల్మల్,సాకేరలెబ్ట్పోచంపాడు, మాదాపూర్‌కూచన్ పల్లి,జఫ్రాపూర్ ,పాక్‌పట్ల,గంజాల్ ,సోన్,న్యూవెల్మల్ గ్రామాలలోనూ గ్రామసభలు జరుగుతాయని,ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకొని రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తాసిల్దార్ మల్లేష్ తెలిపారు.

## పేకాటమోజులో గొలుసు దొంగ

**ప్రజాపక్షం /సుల్తానాబాద్:**పత్తాలాట మోజులో డిగ్రీ విద్యార్థి అప్పుల పాలై దొంగగా మారి జైలు పాలయ్యాడు. తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తుంటే వారు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి అప్పుల ఊబిలో కూరుకు పోయి అప్పులు తీర్చలేక ఏమి తోచని స్థితిలో దొంగలుగా మారి జీవితాలను విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్లా రహదారిలో మామిడి పండ్లు అమ్ముతున్న ఓ మహిళ మెడలోని పుస్తెల తాడును దొంగలించి పోలీసులకు అడ్డంగా దొరికి జైలు పాలయ్యాడు ఓ డిగ్రీ విద్యార్థి. సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం గట్టేపల్లి శివారులోని ఓ మామిడి తోటను లీజుకు తీసుకున్న ఏలేని శ్రీనివాస్ తమ తోటలోనే మామిడి పండ్లను శ్రీనివాస్ చెల్లి రామినేని రమ్య ( 28 ) సం మే నెల 28వ తేదీన తోట సమీపంలో సాయంకాలం అందాదా 3:30 గంటల సమయంలో విక్రయిస్తుండగా కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం పచ్చునూరు గ్రామానికి చెందిన కాల్వ రాజు (21) సం అటుగా తన ద్విచక్ర వాహనంపై వెళుతూ ఒంటరిగా ఉన్న మహిళను గమనించి మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్నట్లుగా వ్యవహరించి జనసంచారం లేకపోవడంతో మహిళ మామిడి పండ్లు తూకం వేస్తున్న క్రమంలో ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును అపహరించి ద్విచక్ర వాహనంపై పారిపోయాడని ఎస్ఐ వివరించారు. రాజు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ పత్తాలు ఆడి దాదాపు లక్ష రూపాయల వరకు అప్పు అయ్యాడని అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో తమ గ్రామంలో ఏదైనా నేరానికి పాల్పడితే దొరికి పోతానని గతంలో పెద్దపల్లి లో సైతం ఓ మహిళ మెడలో రెండు తులాల బంగారు చైను ను దొంగలించిన అనుభవంతో సుల్తానాబాద్ చివారిలో దొంగతనానికి పాల్పడ్డాడని తెలిపారు. రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్సై ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ మహేందర్, కానిస్టేబుల్ రమేష్, రాజ్ కుమార్, అరుణ్, వేణు, కాల్వ శ్రీరాంపూర్ కానిస్టేబుల్ సదానందం, పొత్కపల్లి ఎస్ఐ రత్నాకర్, హెడ్ కానిస్టేబుల్ కిషన్, బృందంగా ఏర్పడి సిసి కెమెరాల సహాయంతో దొంగను పసిగట్టారు. ఆదివారం కోమండ్లపల్లి శివారులో సాయంకాలం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కాలువ రాజు పో లీసులను గమనించి అనుమాన స్పదంగా వ్యవహరించడ ంతో రాజును అదుపులోకి తీసుకొని విచారించగా దొంగలి ంచిన పుస్తెల తాడును కరీంనగర్ లో విక్రయించేందుకు వె ళుతున్నట్లుగా పేర్కొన్నాడని తెలిపారు.అదుపులోకి తీసుకు న్న రాజును రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

## ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

**ప్రజాపక్షం/గంగాధర;**గంగాధర మండలంలోని 33 గ్రామాల్లో 721 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో పాటు అర్హులైన మండల ప్రజలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో నిరుపేద కుటుంబాలకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే ఒక్క గంగాధర మండలంలోని 721 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి నిరుపేదలకు అండగా నిలిచిందని కొనియాడారు. పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు సైతం అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేయలేదని, కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు అందజేస్తుందని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు , సింగిల్ విండో వైస్ చైర్మన్ , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

## 2047 పాలసీ రూపకల్పన

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** పెద్దపల్లి జిల్లాలో నూతనంగా 4 వేల 467 కుటుంబాలకు రేషన్ కార్డ్ జారితెలంగానను దేశంలో అగ్ర స్థానంలో నిలిపేలా తెలంగాణ రైజింగ్2047 పాలసీ రూపకల్పన చేసి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోమవారం ఉదయం ముఖ్య అతిథి పోలీసు గౌరవ వందనం స్వీకరించి ,అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి, జాతీయ పతాకావిష్కరణ చేసారు.అనంతరం ముఖ్య అతిథి తన సందేశాన్ని తెలియజేసారు. నాటి నాటికి పెరుగుతున్న గ్యాస్ సిలిండర్ ధరల భారం మహిళలపై పడకుండా గ్యాస్ సిలిండర్ ను సబ్సిడీ పై 500 రూపాయలకే ప్రజా ప్రభుత్వం సరఫరా చేస్తుంది, మన పెద్దపల్లి జిల్లాలో ఇప్పటి వరకు లక్షా 17 వేల 856 కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను సబ్సీడీ పై సరఫరా చేసి సంబంధిత లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలలో 14 కోట్ల 3 లక్షల రూపాయలు సబ్సీడీ సొమ్ము జమ చేశామని మహిళా కమిషన్ చైర్ పర్సన్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మహిళ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు కటారి రేవతి రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏ. అన్నయ్య గౌడ్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, అదనపు కలెక్టర్లు జె .అరుణశ్రీ, డి.వేణు, డి.సి.పి. కరుణాకర్, ఆర్.డి.ఓ. బి.గంగయ్య, కలెక్టరేట్ ఏ. ఓ. శ్రీనివాస్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన టిఎన్‌జిఓలు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, జిల్లాటీఎన్‌జిఓస్ అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాకు వచ్చిన ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రికి ఉద్యోగుల సమస్యలను విన్నవించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి రాబోయే క్యాబినెట్ సమావేశంలో తగిన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు టిఎన్జీవో సంఘ భవనంలో దారం శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిఎన్జీవోస్ సంఘ కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, టిజిఓస్ సంఘం అధ్యక్షుడు మడిపెల్లి కాళిచరణ్, కార్యదర్శి అరవింద్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహా స్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్ రెడ్డి, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్, భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంత్‌రావు, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి నాగరాజు, రూరల్ అధ్యక్షుడు వాస్తవిక్ గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, నాలుగో తరగతి సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, నాయకులు తదితరులున్నారు.

## 100 రోజులు కార్యాచరణ ప్రణాళిక ప్రారంభం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సిరిసిల్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సోమవారం అమరవీరుల స్తూపం దగ్గర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100రోజుల కార్యాచరణ ప్రతిజ్ఞ ప్రారంభించారు. అమరవీరుల స్తూపం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జూన్ 2 నుంచి సెప్టెంబర్ 9 వరకు పట్టణం లోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో పురోగతి సాధించుటకు ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో శానిటేషన్, ఇంజనీరింగ్, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక మెప్మా విభాగాలు ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులు ఘన సన్మానం..

**ప్రజాపక్షం/బైంసా :**బైంసా పట్టణంలోని జయశంకర్ కాలనీ లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించటం జరిగింది.తెలంగాణ కోసం ఉద్యమాలు చేసిన తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ రామకృష్ణ గౌడ్,సుంకేట పోశెట్టి,కొత్తురు శంకర్,గౌతం,మాణిక్ లను సేవ సమితి సభ్యులు సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు మల్లేష్ ఉపాధ్యక్షుడు రాజన్న,వెంకటేష్,ప్రధాన కార్యదర్శి దిలీప్,ప్రవీణ్,కోశాధికారి భీమా శంకర్ సభ్యులు సుభాష్,నందు,బయ్యా,మాణిక్ పాల్గొన్నారు.

## ఆర్మూర్ సిఐని కలిసిన ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

**ప్రజాపక్షం/ఆర్మూర్ :**ఇటీవలే నూతనంగా ఎన్నికైన నవనాథపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ పార్డెస్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం సోమవారం ఆర్మూర్ సిఐ సత్యనారాయణని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి తమ్మి వినోద్, ఉపాధ్యక్షుడు గంధం చిరంజీవి, కోశాధికారి లిక్కి శ్రావణ్, సంయుక్త కార్యదర్శి పి.ముఖేష్ ఉన్నారు.

# ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/మెట్‌పల్లి** : పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంలో క్రమంగా అభివృద్ధితో ముందుకు సాగుతుంది సీసియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్ రావు అన్నారు. 11 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం మెట్ పల్లి కోర్టు కాంప్లెక్స్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వచ్చాక నూతన జిల్లాలు, డివిజన్ లు , మండలాలు, ప్రతి డివిజన్ కేంద్రంలో ఒక సబ్ కోర్ట్ ఏర్పడ్డాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాన్ , ఉపాధ్యక్షుడు తోగిటి రాజశేఖర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హాఫీజ్, న్యాయవాదులు రాజ్ మహ్మద్ , జిల్లా వెంకటేశ్వర్లు , స్రవంతి, గజేల్లి రామ్ దాస్, కోర్టు సిబ్బంది ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్యాలలో.....

జగిత్యాల జిల్లా మల్యాల మండలం లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రం లో తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ కే.వసంత,మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల ప్రత్యేక అధికారి ,పి.హెచ్ సి వద్ద మౌనిక,కొండగట్టు ఆంజనే యస్వామి దేవస్థాన కార్యాలయం లో ఆలయ ఈవో శ్రీకాంత రావు,సోనియా గాంధీ గుడి వద్ద బత్తిని శ్రీనివాస్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు,పలు ప్రభుత్వ,ప్రైవేట్ కార్యాలయాల్లో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎ వో చంద్ర దీపక్,ఎంఈ వో జయ సింహ రావ్, ఇతర కార్యాలయ సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదిరెడ్డి,ఆనంద్ రెడ్డి ప్రజలు పాల్గొన్నారు.

## ముత్తారంలో...

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయల తో పాటు కాంగ్రెస్,బిజెపి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలను గుర్తు చేస్తూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,ఆయా పార్టీల నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

## చందుర్తిలో...

జూన్ 2 తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం మండలం లో ఘనంగా జరిగాయి.మండల కేంద్రం లోని ఫ్యాక్స్ కార్యాలయంలో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ , బీజేపి బూత్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ పొంచెట్టి రాకేష్ జాతీయ జెండాని ఆవిష్కరించారు.రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య స్థానిక నాయకుల తో కలిసి జాతీయ జెండాని , బీఆర్ఎస్ పార్టీ జెండాని ఎగురవేశారు.అనంతరం మండల కేంద్రం లోని వీధుల గుండా ర్యాలీ గా అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని తెలంగాణా అమరులకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా స్వరాష్ట్ర సాధనలో కేసీఆర్ కృషి ని గుర్తు చేస్తూ తెలంగాణా రాష్ట్ర మహాత్ముడు కేసీఆర్ అని కొనియాడారు.

## జమ్మికుంటలో....

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని బిజెపి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ముందు జాతీయ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కొలకాని రాజు, శీలం శ్రీను, జీడి మల్లేష్, ఆకుల రాజేందర్, రాజేష్ ఠాకూర్, కైలాసకోటి గణేష్, పల్లెపు రవి, మోతె స్వామి, అప్పం మధు, ఇటుకాల స్వరూప, ఎదులాపురం అశోక్, పత్తి జనార్ధన్, కొమ్ము అశోక్, నిరూపరాణి, కేస స్వరూప, గంగాభవాని, మోదం రాజు, రాకేష్ ఠాకూర్ తదితరులున్నారు.

## మానేరులో...



కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రైవేట్ విద్యాసంస్థల విధ్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. బంగారు తెలంగాణకై ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీత రెడ్డితో పాటు ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, కో ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## కొత్తపల్లిలో....

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రజల ఆకాంక్షల మేరకు 14 ఏళ్లు సుదీర్ఘ పోరాటం చేసి కెసిఆర్ తెలంగాణ సాధించారని గుర్తు చేశారు. తెలంగాణను పదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్లహరిశంకర్, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వీర్ల వెంకటేశ్వరరావు, కొత్తపల్లి మండలం మాజీ ఎంపిపి పిల్లి శ్రీలత మహేష్, కొత్తపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ కార్పోరేటర్లు గందె మాధవి మహేష్, గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, కుర్ర తిరుపతి, సుధగోని మాధవి కృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ కొత్తపల్లి మండల అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, టిఆర్ఎస్‌వి నగర అధ్యక్షుడు బొంకూరు మోహన్, శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జి చుక్క శ్రీనివాస్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చొప్పదండిలో...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు విషయంలో ప్రజల ఆకాంక్షలను, అమరుల త్యాగాలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎన్టీఆర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ ఆధ్వర్యంలో మార్కెట్‌లో జాతీయ జెండా ఆవిష్కరించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నిజానపురం చందు, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, మునిగాల సుధాకర్ గౌడ్, గుర్రం రమేష్, ముద్దం తిరుపతి, తాళ్లపల్లి శ్రీనివాస్, కడారి శంకర్, మునిగాల చందు, తోడేటి డేవిడ్, గుంటి స్వరూప, నల్లాల అఖిల్, కనుమల్ల రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సంధర్భంగా తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ (టిఆర్ఎస్(డి)) ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని వారి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. టిఆర్ఎస్(డి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇంఆచర్జి చిగుర్ల రాజు హాజరై కేక్ కట్ చేసారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సబ్బండ వర్గాల ప్రజలు రాజకీయాలకతీతంగా ఎన్నో ఉద్యమాలు, వందలాది విధ్యార్థి అమరవీరుల త్యాగాలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలె శ్రీనివాస్, పార్టీ కార్పోరేషన్ అధ్యక్షుడు పెట్టం సుధాకర్, యూత్ అధ్యక్షుడు కరణ్, మహిళ నాయకురాలు సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో....



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు.మండల తహసిల్దార్ లో ఎమ్మార్వో వరందన్ ,మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామ్ రెడ్డి ,స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై చిర్ర సతీష్,వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ బీమా సంతోష్ ,రైతు వేదిక వద్ద ఏవో కరుణ,శ్రీ సాయి మండల సమైక్య కార్యాలయంలో అధ్యక్షురాలు మార్కం వజ్రవ్వ , ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి శ్రీకాంత్ , గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులు జాతీయ పతాకాన్ని ఎగరవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు .అనంతరం తెలంగాణ గీతాన్ని ఆలపించి అమరవీరులకు జోహార్లు అర్పించారు .ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరుద్యోగ యువకులు ,ఉద్యోగులు సబ్బండ వర్గాల త్యాగ ఫలితం తోటే తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం జరిగిందని ,రాష్ట్రం కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసిన త్యాగ మూర్తులను స్మరించుకుంటూ వారి ఆశ సాధన కోసం రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేసే విధంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్‌లో...



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో జాతీయ పతాకం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ముందుగా తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు బిసి నా అనంతరం .పోలీస్ స్టేషన్ లో సీఐ సుబ్బారెడ్డి, మున్సిపల్ కార్యాలయం తోపాటు కార్యాలయం ముందు ప్రధాన కూడలిలో కమిషనర్ మమ్మద్ నియాజ్, మండల విద్యా వనరుల కార్యాలయంలో ఎంఈఓ రాజయ్య,ట్రాన్స్కో కార్యాలయంలో ఏడి అడిచెర్ల శ్రీనివాస్, సింగిల్ విండో కార్యాలయాలలో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, దేవరనేని మోహన్ రావు, జూపల్లి సందీప్ రావు, గడ్డం మహిపాల్ రెడ్డి, కోట వీణ రాజమల్లారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో దివ్య దర్శన్ రావు, సివిల్ ఆస్పత్రిలో సూపర్డెంట్ రమాదేవి, మున్సిఫ్ కోర్టు లో జడ్జ్ దుర్గం గణేష్, తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ఎం డి బషీరుద్దీన్. జెండా ఎగురవేయగా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పలు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలతో పాటు వివిధ యూనియన్లు సంఘాలు పార్టీల నాయకులు ముఖ్య కూడళ్లు తదితర ప్రదేశాలలో జాతీయ పతాకాలను ఆవిష్కరించి సంబరాలు నిర్వహిస్తున్నారు.

## బసంత్‌నగర్‌లో....



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన వారికి నివాళులర్పించారు. ఈసందర్భంగా గ్రామంలో ఉత్తమ సేవలు అందించిన వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అరకల సతీష్, నాయకులు దండుగుల శ్రీకాంత్, లాల్‌సింగ్, శంకర్ నాయక్, కుమార్ గౌడ్, కాల్వ అంజయ్య యాదవ్, ఎరుకల సాగర్‌గౌడ్, మహ్మద్ షబ్బీర్, సంపంగి కుమార్, కొమిరే సురేష్, భూతగడ్డల రమేష్, మాదాసు రమేష్‌లు పాల్గొన్నారు.

## అంతర్గాంలో...



పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఒబిసి సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఎగురవేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మెరుగు కుమార్‌గౌడ్, నాయకులు పల్లె రవీందర్, ఓరేటి మహేష్, తమ్మనవేని కోటి, గుజ్జుల సుధాకర్‌రెడ్డి, అంజన్న, అశోక్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

## రామగుండంలో...

రామగుండం పట్టణంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కౌశిక లత, కన్నూరి సతీష్‌కుమార్, నాయకులు ముస్తాఫా, మద్దికుంట శంకర్, శివరాత్రి గంగాధర్, బదావత్ సారయ్య నాయక్, మాడిశెట్టి రవి, దారంగుల కుమార్, మద్ది అన్వేష్, ఆసాది వేణుగోపాల్, ఎండి.అతరొద్దీన్, షేక్ ఇంతియాజ్‌లు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో...

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే సతిమణి, మక్కన్‌సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలి ఠాకూర్ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. తెలంగాణ ప్రజల త్యాగాలు, ఆత్మ బలిదానాలతో ఏర్పడిన రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఇందుకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.